క్లుప్తంగా

అమృత్ మిత్ర 2.0 ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ భాస్కర్

నర్సంపేట: పట్టణంలోని కుమ్మరికుంట చెరువు వద్ద అమృత్ మిత్ర 2.0 కార్యక్రమాన్ని బుధవారం మునిసిపల్ కమిషనర్ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమ్మరికుంట చెరువును సందర్శించి చెరువు దగ్గరలో ఉన్న ధరణి, సృష్టి స్లం సమాఖ్యల ఎదుట సంఘాల మహిళలతో చెట్లు నాటించడానికి కమిషనర్ అమృత్ మిత్ర 2.0 కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రాజేష్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మెప్మా డీఎంసీ జి.రేణుక, ఏడీఎంసీ ఎస్‌కె.వహీద, టీఎల్‌ఎఫ్ ఆర్‌పి ఆర్.మాధవి, సీఎల్‌ఆర్‌పి డి.సుమలత, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

తాటిచెట్లను తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి



అక్రమంగా నరికి వేసిన తాటిచెట్లు

వర్ధన్నపేట : అక్రమంగా తాటిచెట్లను నరికి పడవేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఇల్లంద గ్రామ గౌడ కులస్తులు బుధవారం వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు గౌడ పెద్దలు తెలిపారు. ఇల్లంద గ్రామశివారు రామోజీ కుమ్మరిగూడెం రోడ్డు పక్కనున్న చెలకల గట్లపై పెరిగిన తాటివనంలో 8 చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా గౌడ కులస్తులను ఆర్థికంగా దెబ్బ తీయడానికి రాత్రికి రాత్రి ఎవరూ లేని సమయంలో చెట్లను నరికి వేశారు. వ్యక్తులను గుర్తించి చట్టపరంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గౌడ పెద్దలు సమ్మెట సూరి, సట్ల సూరి, కత్తి వేణు, ఉన్నారు.

రాజుకు దళితరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజు

వర్ధన్నపేట : మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన జన్ను రాజుకు దళితరత్న అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ ఉత్సవ కమిటీ, శాతవాహన యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. దళిత సమాజాన్ని విద్యావంతులుగా మార్చే దిశలో భాగంగా సేవా భావంతో అనేక కార్యక్రమాలు చేస్తున్నందుకు 134వ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దళితరత్న అవార్డు అందుకోవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డును అందచేసిన తెలంగాణ రాష్ట్ర ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు, రాష్ట్ర మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు, దళిత సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగు పాటుకు గేదె మృతి

నెక్కొండ : పిడుగు పాటుకు పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని అమీన్‌పేటలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిలుపూరి సారమ్మ ఉదయం పాడి గేదెను మేతకు తీసుకెళ్లింది. గ్రామ శివారులో గేదె మేత మేస్తుండగా ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో పిడుగు పడడంతో గేదె మృతి చెందింది.

ఇరుముడితో బయలుదేరిన స్వాములు



పుణ్యక్షేత్రాలకు బయలుదేరి వెళ్తున్న హనుమాన్ స్వాములు

నర్సంపేట : ఇరుముడితో గ్రామాల్లోని హనుమాన్ స్వాములు మాల విరమణ చేయడానికి పుణ్యక్షేత్రాలకు బయలుదేరి వెళ్లారు. మాలధారణ చేసిన స్వాములు బుధవారం చెన్నారావుపేట గ్రామంలోని హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా తిరుగుతూ నగర సంకీర్తన నిర్వహించి భజనలు చేశారు. అనంతరం ఇరుముడి కట్టుకొని భద్రాచలం, విజయవాడ, కొండగట్టు, గీసుగొండ, తిరుపతి, తదితర పుణ్యక్షేత్రాలకు వాహనాల్లో తరలివెళ్లారు. దీంతో గ్రామాల్లో హనుమాన్ స్వాముల సందడి వాతావరణం కనిపించింది.

ఇందిరమ్మ మోడల్ హౌస్

- నత్తనడకన నమూనా ఇంటి నిర్మాణం
- గడువు దాటినా పూర్తికాని పరిస్థితి
- బెడ్ పోసి వదిలేసిన లబ్ధిదారులు



సంగెంలో బెడ్‌వరకే పరిమితమైన ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్

సంగెం : ఇందిరమ్మ మోడల్ హౌస్ (నమూనా ఇల్లు) నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. మోడల్ హౌస్ బెడ్ వరకే పరిమితమైంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో(ఎల్1) అర్హులైన వారికి సొంత జాగ ఉంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. అంతేగాక మండలానికి ఒక గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి విడతల్లో అమలు చేసే ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర సంక్షేమ పథకాలు ఒకే దఫాలో అమలు చేస్తున్నారు. మండలంలో షాపూర్ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆ గ్రామంలో అర్హులైన 39 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా పలువురు ఇళ్లకు ముగ్గులు పోసి ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. ఈ మేరకు మోడల్ గ్రామంతో పాటు ఇతర గ్రామాల్లోనూ ఇళ్ల పథకానికి అర్హులైన వారిని ఎంపిక చేయడానికి సర్వేను పూర్తి చేశారు. ఈ పథకం ద్వారా అర్హులకు రూ.5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ముందుగా ప్రతి మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్‌ను నిర్మించాలని నిర్ణయించారు.

బెడ్ వరకే పరిమితం..

పేదలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం అందించే రూ.5 లక్షల్లో ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలనే లక్ష్యంతో మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టి 45 రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గత ఫిబ్రవరిలో ముగ్గుపోసి పునాదులు తీసి వదిలివేశారు. అనంతరం మార్చిలో సాక్షి కథనానికి స్పందించి ఫిల్లర్లు వేసి బెడ్‌పోసి వదిలివేశారు. అప్పటి నుంచి మోడల్ హౌజ్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మోడల్ హౌజ్ నిర్మాణం ప్రారంభించి మూడు నెలలు గడుస్తున్నా ఇంకా బెడ్‌వరకే ఉండడంతో నిర్మాణంలో అధికారులు విఫలయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాప్యానికి కారణాలేమిటో...

రూ.5 లక్షలతో నిర్మించే ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణమే ఇలా జాప్యం జరుగుతుంటే ఇక లబ్ధిదారులు ఈ మోడల్ హౌస్‌ను చూసి నిర్మాణాలు చేపట్టాలంటే ఎలా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నమూనా ఇంటి నిర్మాణం మొదలు కాకుండానే మండలంలోని మోడల్ గ్రామంలో ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక మిగిలిన గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక తుది దశకు చేరుకున్నది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా తమ సొంతింటి కల నెరవేరుతుందోనని పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

> **త్వరలో పూర్తి చేస్తాం**
>
> మోడల్ హౌస్ నిర్మాణం ఆగిపోయింది వాస్తవమే. నేను ఇటీవలే ఔట్‌సోర్సింగ్ హౌజింగ్ ఏఈగా బాధ్యతలు స్వీకరించాను. ప్రభుత్వం విధించిన గడువులోగా నమూనా ఇంటి నిర్మాణం చేయాల్సి ఉండే కానీ జాప్యం జరిగింది. త్వరలో పనులు మొదలు పెట్టించి మోడల్ హౌజ్ నిర్మాణం పూర్తి చేయిస్తాం.
>
> – సాద్విక, ఏఈ హౌజింగ్

మిల్లర్లు దిగుమతి చేసుకోకపోతే చర్యలు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

నల్లబెల్లి : ఏ గ్రేడ్ 1638 రకం ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోకపోతే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి హెచ్చరించారు. మండలంలోని రాంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. తేమశాతాన్ని తనిఖీ చేసి రైతులు, నిర్వాహకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 1638 ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేసుకోవడంలేదని రైతులు తమ గోడును తెలియజేశారు. స్పందించిన అదనపు కలెక్టర్ మిల్లర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వెంటనే ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, తహసీల్దార్ కృష్ణ, ఏపీఎం సునిత తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాబు



మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నర్సంపేట: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెంచి వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌ను బుధవారం సందర్శించారు. మార్కెట్‌లో రైతులతో మాట్లాడగా మార్కెట్లో ధాన్యం సరిపడా కాంటాలు పెట్టకపోవడం, పెట్టిన ధాన్యాన్ని వెంటనే తరలించకపోవడంతో మందకొడిగా కాంటాలు జరుగుతున్నట్లు రైతులు రైతు సంఘం నాయకులతో వాపోయారు. ఖరీదు దారులు బార్దాన్ సరఫరా చేయక కాంటాలు సక్రమంగా పెట్టకపోవడంతో రెండు వారాల నుంచి కల్లాల మీద ధాన్యాన్ని పోసుకుని రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కుమారస్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనాథ్, గొర్రెల మేకల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, కుక్కల సతీష్ పాల్గొన్నారు.

విత్తనాలు డీలర్ల వద్ద కొనుగోలు చేయాలి



విత్తన షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

నర్సంపేట రూరల్ : రైతులు విత్తనాలను అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని నర్సంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్‌రెడ్డి అన్నారు. సీడ్ టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో పట్టణంలోని విత్తన షాపులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడ్ ప్యాకెట్స్‌పై అన్ని వివరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల బిల్లులను పంట పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్సై రవికుమార్, ఏఓ కృష్ణకుమార్, గోపాల్‌రెడ్డిలు ఉన్నారు.

ఐటీ రంగానికి ఊపిరి పోసిన రాజీవ్‌గాంధీ

దేశంలో ఐటీ రంగాన్ని తీసుకొచ్చిన ఘనత స్వర్గీయ రాజీవ్‌గాంధీకే దక్కుతుందని, ఆయన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. నెక్కొండ, నర్సంపేట, పర్వతగిరి, దుగ్గొండి, వర్ధన్నపేట, రాయపర్తి, గీసుకొండ మండల కేంద్రాలు, మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఫ్లెక్సీలు, చిత్రపటాలలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దూరదష్టితో ఆలోచనలకు పదును పెట్టి ప్రపంచ దేశాలతో భారత్ శాస్త్ర సాంకేతిక రంగాల్లో పోటీపడుతూ నేటి ఆన్‌లైన్ సేవలకు కృషి చేశారన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయ సాధన కోసం యువత, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల, గ్రామ పార్టీల అధ్యక్ష,కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


– సాక్షి, నెట్‌వర్క్



నెక్కొండ : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు



నర్సంపేట : నివాళులర్పిస్తున కాంగ్రెస్ నేతలు



వర్ధన్నపేట : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



పర్వతగిరి : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



దుగ్గొండి: గిర్నిబావిలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



రాయపర్తి : రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆంగ్లభాషా నైపుణ్యం ఎంతో అవసరం



నర్సంపేట : విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను అందజేస్తున్న రవికుమార్



గీసుకొండ : ధర్మారంలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



సంగెం : విద్యార్థినులు వేసిన పెయింటింగ్, కుట్లు, అల్లికలను చూపుతున్న టీచర్లు

నర్సంపేట : ఆంగ్ల భాషా నైపుణ్యం ఎంతో అవసరమని లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు, ఇంగ్లిష్ అధ్యాపకుడు కాసుల రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశానికి ఆయన హాజరై విద్యార్థులకు నేటి పోటీ యుగంలో ఆంగ్ల ప్రాధాన్యతను వివరించారు. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తేజావత్ జయ తెలిపారు. బుధవారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 నుంచి 9వ తరగతి చదివే 110 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొన్నారని తెలిపారు.

నర్సంపేట రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మహేశ్వరం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు స్వరూప అన్నారు. విద్యార్థులకు యోగా, డాన్స్, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

గీసుకొండ : ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ, హెచ్‌ఎం సాంబయ్య విద్యార్థులతో కేక్ కట్ చేయించారు.

సంగెం : సమ్మర్ క్యాంపు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మొండ్రాయి పాఠశాల హెచ్‌ఎం కె.విజయ అన్నారు. బుధవారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

రాయపర్తి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 15 రోజుల వేసవి శిక్షణ శిబిరం ముగిసినట్లు సీనియర్ ఉపాధ్యాయురాలు గుగులోతు సునిత తెలిపారు. బుధవారం విద్యార్థులతో ముగింపు సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న బైక్ మెకానిక్ మృతి

నల్లబెల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బైక్ మెకానిక్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోల్లోనిపల్లి గ్రామానికి చెందినన బిక్కనూరి శుభాష్(29) మండల కేంద్రంలో కొంతకాలంగా బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. తనకున్న రెండు ఎకరాల్లో కుటుంబ సభ్యులతో కలిసి వరి పంట సాగు చేస్తుండగా సరైన దిగుబడి రాలేదు. దీంతో మనస్తాపానికి గురై మద్యానికి అలవాటై ఈ నెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి రాజమల్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

దాడి చేసిన అన్నపై కేసు నమోదు

సంగెం : భూమి విషయంలో గొడవపడి దాడి చేసిన అన్నపై కేసు నమోదు చేసినట్లు పీఎస్సై అర్చన తెలిపారు. మండలంలోని గవిచర్లకు చెందిన బొలుగొడ్డు కుమారస్వామి, కొమురయ్యలు అన్నదమ్ములు వీరికి కెనాల్ వద్ద భూమి విషయంలో తగాదా ఉన్నది. ఆ భూమిని గత ఏడాది అన్న కుమారస్వామి దున్నుకున్నాడు. తిరిగి మళ్లీ కుమారస్వామి దున్నుతుండగా తమ్ముడు కొమురయ్య వెళ్లి భూమి దున్నవద్దని అనడంతో అన్న కుమారస్వామి బూతులు తిడుతూ తమ్ముడి వీపు, కుడి చేయి, ఎడమ కాలుపై కొట్టాడు. అక్కడే ఉన్న గ్రామానికి చెందిన బుట్టి దూడయ్య వచ్చి ఆపాడు. కొమురయ్య ఫిర్యాదు మేరకు దాడి చేసిన అన్న కుమారస్వామిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

నర్సంపేట రూరల్ : అక్రమంగా నిల్వచేసిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పట్టణంలోని పాకాల్ సెంటర్‌లో రమేశ్‌కు చెందిన కిరాణం షాపులో అక్రమంగా నిల్వ చేసిన రూ. 3,100 విలువగల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

10 లీటర్ల గుడుంబా పట్టివేత

సంగెం : ప్రభుత్వం నిషేధించిన 10 లీటర్ల గుడుంబాను పట్టుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ప్రొబెషనరీ ఎస్సై అర్చన తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని వీఆర్‌ఎన్ తండాలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించి పారిపోవడానికి ప్రయత్నించాడు.. అతనిని ఆపి తనిఖీ చేయగా 10 లీటర్ల గుడుంబా లభించింది. గుడుంబా కలిగి ఉన్న గుగులోతు బిల్యాను, గుడుంబాను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై తెలిపారు.

కాళేశ్వరంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ఛేదిస్తూ అనుభవజ్ఞులైన నిపుణులచే రూపొందించిన సమగ్ర నివేదికను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలు, రైతాంగం ముందు ఉంచుతుందన్నారు. మేధావులు, విద్యావంతులు, బుద్ధిజీవులు, ప్రజలు, రైతులు, యువత ఈ నివేదికను చదివి వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క ఫిల్లర్ డామేజ్ జరిగితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారం రాష్ట్ర ప్రజలందరికి తెలుసని అన్నారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చిన ఆదరణను చూసి, సభ కోసం లక్షలాదిగా తరలివచ్చిన యువత, రైతాంగాన్ని చూసి ఓర్వలేక వారిని కేసీఆర్ నుంచి దూరం చేసే కుట్రలో భాగంగా ఈ దుష్ప్రచారానికి తెరలేపారని అన్నారు. కాళేశ్వరం విచారణలో పీసీ ఘోష్ కమిషన్ గడువు ముగిసిందని ప్రకటించినా, కుట్ర పూరితంగా తిరిగి రెండు నెలలు పెంచి వెంటనే గడియాల్లో తీసుకుని కేసీఆర్, హరీష్‌రావుకు నోటీసులు పంపించడం ఈ కుట్రలో భాగమేనని తెలంగాణ ప్రజలు, రైతాంగం, మేధావులు ఆలోచించాలని పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

మైనార్టీ గురుకులాల్లో చేర్పించండి

న్యూశాయంపేట: నాణ్యమైన విద్యను అందిస్తున్న మైనార్టీ గురుకులాల్లో తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని టిమ్రిస్ అకడమిక్ కోఆర్డినేటర్ రుహినా అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, అధ్యాపకులు కలిసి హనుమకొండ ఈద్గా, లష్కర్‌బజార్, బొక్కలగడ్డ తదితర ప్రాంతాల్లో బుధవారం కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయిషా, యాస్మిన్, షబానా, పద్మ, సర్వర్ మొహియొద్దీన్, సుల్తాన్, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులుగా తాగునీరు బంద్



బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని కొత్తవాడ కాలనీలో ఐదు రోజులుగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నెలల క్రితం కాలనీలో పాత మంచినీటి పైపులైన్ మరమ్మతుకు రాగా గ్రామపంచాయతీ సిబ్బంది మరమ్మతు చేయకుండా వదిలేశారు. గ్రామంలోని అన్ని చోట్ల పాత పైపులైన్ నుంచి మంచినీటి సరఫరా అవుతున్నా మా కాలనీ కనీసం పాత పైపులైన్ రిపేరు చేస్తే మంచినీటి సరఫరా అయ్యేదని కాలనీవాసులు మంతుర్తి దిలీప్, మంతుర్తి విజయ, తుంగ ఎల్లయ్య, నూనె యాదగిరి, నూనె మల్లేషం, నూనె అనసూయ, నూనె రజిత, నూనె మని, ఎం.శ్రీశైలం, చెవ్వ పద్మ, జంగ శ్రీలత, నూనె రమాదేవి, బైరబోయిన రామ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని కాలనీవాసులు ఆరోపించారు. ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తామన్న నీఇష్టం ఉన్న చోట చెప్పుకో అని పంచాయతీ కార్యదర్శి పొంతనలేని సమాధానం చెబుతున్నాడని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గాలివాన బీభత్సం



విద్యుత్ తీగలపై వంగిన హోర్డింగ్

వర్ధన్నపేట : పట్టణంలో బుధవారం గాలివాన బీభత్సంతో ఓ భవనంపై ఉన్న హోర్డింగ్ వంగిపోయి విద్యుత్ తీగలపై పడి ఒకదానికి ఒకటి రాపిడికి గురై మంటలు చెలరేగాయి. వెంటనే విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. హోర్డింగ్‌ను సరి చేసి తీగలను పునరుద్ధరించి సరఫరా చేయడంతో పట్టణవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

బాల్యమిత్రుల కుటుంబాలకు చేయూత



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిన్ననాటి మిత్రులు

రాయపర్తి: ఇటీవల మృతిచెందిన మండలంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన బీరెల్లి మహేందర్, మండల కేంద్రంలో ఎనగందుల వనజ మృతి చెందగా వారి కుటుంబాలను చిన్ననాటి స్నేహితులు బుధవారం పరామర్శించారు. మహేందర్ కుటుంబానికి రూ.23 వేలు, వనజ కుటుంబానికి రూ.22 వేలు ఆర్థికసాయంగా అందించినట్లు తెలిపారు. వారితో 2001లో మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పరామర్శించిన వారిలో రమేష్, శ్రీకాంత్, రాజు, ఎండీ ఇక్బాల్, ఎండీ రజాక్, మధు, సీహెచ్ కృష్ణకుమార్, సంతోష్, ఎం.అశోక్, రేసు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.